

ఆర్‌టిసి డిఎంగా రోషన్ బాధ్యతల స్వీకరణ


రోషన్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు ఆర్టీసీ డిపో మేనేజరుగా ఎస్ఎండి రోషన్ బాధ్యతలు చేపట్టారు. గూడూరు ఆర్టీసీ డిపో మెటీరియల్ విభాగం అసిస్టెంట్ మేనేజరుగా పనిచేస్తున్న రోషన్ ఉద్యోగోన్నతిపై పీలేరు ఇన్‌ఛార్జి డిపో మేనేజర్‌గా బుధవారం విధులు స్వీకరించారు. ఆయనను ఆర్టీసీ ఉద్యోగులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ తాను డిపో అభివృద్ధికి, ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నానన్నారు. తన ప్రయత్నానికి అందరూ ప్రోత్సాహాన్ని అందిస్తూ తనకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ధనుంజయ, బస్ స్టేషన్ మేనేజర్ బాబు నాయక్, ఎడిసిలు ఎల్లయ్య, కెఎస్ రెడ్డి, సత్యం, శేఖర్, కెకె నాయుడు, పిఆర్ మోహన్ పాల్గొన్నారు.

వ్య.కా.స జాతీయ సమావేశాలు విజయవంతం

- మూడ్రోజులపాటు సుదీర్ఘంగా సాగిన మేధోమథనం
- సంఘం బలోపేతానికి దిశానిర్దేశం
- కేరళ ఎంపీ వి.శివదాసన్ సహా జాతీయ కార్యవర్గం హాజరు
- జిల్లా కేడర్‌లో పెరిగిన జోష్


ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న వ్య.కా.స జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకట్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలు బుధవారం సాయంత్రంతో జయప్రదంగా ముగిశాయి. ఈ నెల 8, 9, 10వ తేదీల్లో నగరంలోని హరిత హోటల్‌లో మూడ్రోజులపాటు నిర్వహించిన జాతీయ కౌన్సిల్ సమావేశాలకు వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షులు కె.విజయరాఘవన్, జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్‌తో కలిసి కేరళ ఎంపీ వి.శివదాసన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వ్య.కా.స రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు వంటి ప్రముఖుల పర్యవేక్షణలో ఉత్సాహపూరిత వాతావరణంలో జాతీయ సమావేశాలను నిర్వహించారు. తొలిరోజు కడప కోటిరెడ్డిసర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, ఏడురోడ్ల కూడలి, పాతబస్టాండ్ సర్కిల్‌లోని జ్యోతిబాపూలే సర్కిల్ మీదుగా విప్లవ గీతాలు, జానపద గీతాలాపన చెక్కభజన, ప్రజానాట్య మండలి కళాకారుల వివిధ నృత్య రీతులతో బహిరంగ సభ వేదిక వరకు సాగిన భారీ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం నిర్వహించిన బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా హాజరైన జాతీయ అధ్యక్షులు కె.విజయరాఘవన్, కేరళ ఎంపీ వి.శివదాసన్, జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు ప్రసంగాలు సభికులను ఆలోచనలో పడేశాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల్లోని లోపాలను తూర్పార బట్టడం ప్రజలను ఆకట్టుకుంది. రెండవ రోజు వ్యవసాయ కార్మిక సంఘం జెండాను వ్య.కా.స జాతీయ అధ్యక్షులు కె.విజయరాఘవన్ ఆవిష్కరించారు. అనంతరం అమరుల స్థూపానికి నివాళులర్పించారు. తర్వాత సెమినార్ హాలులో సిపిఎం అగ్రనేతలైన పుచ్చలపల్లి సుందరయ్య, సీతారాం ఏచూరి, కేరళ మాజీ ముఖ్యమంత్రి సహా పలువురు చిత్రపటాలకు పూలమాలలు వేసిన అనంతరం దేశంలో ఇటీవల మృతి చెందిన ప్రజాసంఘాల నాయకులను స్మరించుకుని రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షులు కె.విజయరాఘవన్ దేశంలోని వర్తమాన రాజకీయాలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ, వ్యవసాయ మహిళా కమిటీల గోష్టి నిర్వహించారు. అనంతరం వ్య.కా.స జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. అనంతరం 22 రాష్ట్రాల నుంచి వచ్చిన 200 మంది ప్రతినిధులు ఆయా రాష్ట్రాల్లో చేసిన పోరాటాల్లో ఎదురైన అనుభవాలను సమీక్షించుకుని సంఘం కార్యకలాపాలను పెంచడానికి సంబంధించిన భవిష్యత్ ఎజెండాను రూపకల్పన చేశారు. మూడవ రోజైన బుధవారం అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘ సమావేశాలను అంచనాలకు మించి విజయవంతం చేసిన జిల్లా కమిటీ సభ్యులను జాతీయ నాయకులు అభినందించారు. జాతీయ నాయకులను జిల్లా నాయకులు శాలువాలు కప్పి సన్మానించారు. జాతీయ సమావేశాలను ముగించిన అనంతరం ప్రతినిధులు తమ రాష్ట్రాలకు వెళ్లిపోవడంతో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఊపిరిపీల్చుకుంది. సమావేశాల్లో వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జి.శివకుమార్, వి.అన్వేష్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామనూరు శ్రీనివాసులరెడ్డి, బి.మనోహర్, సిఐటియు జిల్లా కార్యదర్శి రామ్మోహన్, దస్తగిరిరెడ్డి, ఎన్.చంద్రారెడ్డి, ఎన్.శివకుమార్, ఎస్.రవి, వీరనాల శివకుమార్, సత్యం, ఆర్.రాహుల్, లక్ష్మీరాజా, పి.మహేష్, జకరయ్య, సునీల్, సుబ్బయ్య, మహిళా నాయకులు లక్ష్మీదేవి, జమీలా పాల్గొన్నారు.

జిల్లాకు స్వచ్ఛాంధ్ర అవార్డులు తీసుకురండి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్ర ప్రభుత్వం పరిశుభ్రతకు అగ్రస్థానం ఇస్తున్న నేపథ్యంలో స్వచ్ఛాంధ్ర రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డుల ఎంపికలో నిర్దేశించిన ప్రతి పారామీటర్‌లో 100 శాతం అభివృద్ధి సాధించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్సు ద్వారా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌తో కలిసి స్వచ్ఛంధ్ర అవార్డులపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛంధ్ర రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డుల ఎంపికలో ప్రతి పారామీటర్‌లో 100 శాతం అభివృద్ధి అవసరమని, నిర్దేశించిన పనిలో వెనుకబడితే సంబంధిత శాఖలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవార్డులకు లక్ష్యంగా విధించిన మొత్తం 13 కేటగిరీల్లో ఎంపిక చేసిన గ్రామ పంచాయతీలు, పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, అంగనవాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రైతు బజార్లు, బస్టాండ్‌లు తదితర ప్రాంతాల్లో రాష్ట్ర స్థాయి బృందాలు వివిధ పారామీటర్ల మేరకు పరిశీలిస్తారని, ఈ మేరకు అధికారులు సిద్ధం కావాలని చెప్పారు. ఇందుకోసం నియోజకవర్గ స్పెషల్ అధికారులు నిర్దేశించిన పారామీటర్లపై పారిశుధ్యలోటుపాట్లను గుర్తించి సంబంధిత శాఖలకు తెలియజేయాలని ఆదేశించారు. కింది స్థాయి సిబ్బందికి పనులు అప్పగించామన్న రీతిలో కాకుండా దగ్గరుండి పనులు చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంగనవాడీ కేంద్రాలు, పాఠశాలల్లో తాగునీటి సదుపాయం, ట్యాప్ కనెక్షన్, టాయిలెట్లు, రీడింగ్ రూమ్, స్వచ్ఛత క్లబ్, పరిసర పరిశుభ్రత వంటి అన్ని సౌకర్యాలను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వస్తున్న రోగులకు అవసరమైన మందులు, పరికరాలు, టాయిలెట్ల పరిశుభ్రతపై పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత శాఖలు పోటీ తత్వంతో, కాలక్షేపంగా కాకుండా ఉత్సాహంగా పనిచేస్తే ముఖ్యమంత్రి న్భుజ అవార్డు పొందే అవకాశం ఉంటుందని కలెక్టర్ సూచించారు. అన్ని శాఖలు, అధికారులు సమన్వయంతో కలిసికట్టుగా పని చేసి స్వచ్ఛ అన్నమయ్య జిల్లాకు శ్రీకారం చుట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో సిపిఒ, డిఇఒ, ఐసిడిఎస్ పీడీ, డిపిఒ, డిఎంహెచ్ఒ, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గాయపడిన కూలీలను ఆదుకోవాలి : సిపిఎం


గాయపడిన బాధితులను పరామర్శిస్తున్న శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందించి, ఆదుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం ఉదయాన్నే టమోటా కోతకు పట్టణంలోని విజయనగర్ కాలనీ నుండి ముదివేడు వెళుతున్న వ్యవసాయ కూలీల ఆటో బోల్తా పడి 11 మంది గాయపడ్డారు. గాయపడిన కూలీలను మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో వీరిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కరువు పరిస్థితుల వల్ల పనులు లేక వలసలు వెళ్లడం పెరిగిందన్నారు. రూ.300 కూలీ కోసం మదనపల్లె పట్టణం నుండి గ్రామాలకు కూలీలు వెళుతుండటం కరువు తీవ్రతకు నిదర్శనమన్నారు. ఇరుకైన వాహనాల్లో ఎక్కువమంది కూలీలు పనుల కోసం వెళ్లడం, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు పెద్ద సంఖ్యలో పేదలు ప్రాణాలు కోల్పోవడం, తీవ్రంగా గాయపడడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ చట్టం పట్టణ ప్రాంతాల్లో విస్తరించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. గ్రామీణ ఉపాధి పనులకు కేంద్రం నిధుల కోతకోస్తే వాటిని సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ముదివేడు రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యవసాయ కూలీలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని కోరారు. గాయపడిన ప్రతి ఒక్కరికి రూ. లక్షలు చొప్పున ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు నాగరాజు, రెడ్డి ప్రసన్న పాల్గొన్నారు.

మహిళల భద్రత, సాధికారతకు కృషి : జెసి



సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

ప్రజాశక్తి - రాయచోటి

మహిళల భద్రత, సాధికారతను పెంపొందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం మిషన్ శక్తి పథకాన్ని ప్రారంభించిందని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తి పథకంలో భాగంగా సంకల్ప కార్యక్రమాన్ని జిల్లాలో ఈనెల 2 నుంచి సెప్టెంబర్ 12 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా బుధవారం రాయచోటి కలెక్టర్ కార్యాలయంలోని పిజిఆర్ఎస్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మహిళల భద్రత, రక్షణ కోసం ప్రభుత్వం వివిధ రకాల పథకాలను, చట్టాలను, ఏర్పాటు చేశామన్నారు. వీటన్నింటిపై అవగాహన, సద్వినియోగం చేసుకోవడం కోసం మిషన్ శక్తి పథకంలో భాగంగా సంకల్ప కార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు. అవగాహన కార్యక్రమాలల్లో బేటీ బచావో బేటీ పఢావో, మహిళల భద్రత, చట్టపరమైన అవగాహన, ఉన్నత విద్య, వృత్తి శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, మహిళలు- కౌమార బాలికల ఆరోగ్యం, పోషకాహారం, సమాజంలో జరిగే క్రైమ్‌లు తదితర అంశాలపై అవగాహన కల్పించాలని అన్నారు. సమాజంలో మన చుట్టూ మహిళలపై జరిగే అక్రమాలను ప్రశ్నించేలా, చట్టపరమైన చర్యలు తీసుకునేలా మహిళలు ముందుకు రావాలని కోరారు. అవగాహన కార్యక్రమాల్లో సిడిపిఒలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీలు ముందుగా పూర్తి అవగాహన కలిగి ఉండాలని అలాగే వారికి అవగాహన కల్పించే సమయంలో అందరికీ చేరే విధంగా వివిధ రకాల మాధ్యమాల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి హైమావతి, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, సిడిపిఒలు,ఆశా వర్కర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.


ప్రతిభ అవార్డు అందుకుంటున్న విద్యార్థి

విద్యార్థులకు ప్రతిభ అవార్డులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎన్‌జిఒ హోమ్‌లో బ్రిడ్జి ఇండియా సొసైటీ ప్రథమ వార్షిక సర్వసభ్య సమావేశం బుధవారం అధ్యక్షులు కె.రాజేంద్రన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ డిజిపి రాధాకృష్ణ పాల్గొన్నారు. 10వ తరగతి నందు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఏడుగురు విద్యార్థులకు అంబేద్కర్ ప్రతిభ అవార్డులను ప్రదానం చేశారు. గురుకులంలో ప్రవేశం పొందిన 12 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంస్థను ప్రారంభించి ఏడాది కావస్తోందని, ఈ సంవత్సరకాలంలో 8 కార్యక్రమాలను నిర్వహించి పలువురు పేద పిల్లలకు సహాయ సహకారాలు అందించామన్నారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి ముని వెంకటప్ప, కోశాధికారి, ఎవి రమణ, సంస్థ సభ్యులు ముత్యాలు, కుమారస్వామి, బిసి రెడ్డి, ఎర్రయ్య, రెడ్డప్ప, సుధాకర్, ఎల్ఐసి సహదేవ, రమణ, డిఎస్ఎస్ నరసింహులు, సిపిఎం శ్రీనివాసులు, రామలింగప్ప, గురుమూర్తి పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ కార్యదర్శులుగా నాగరాజు, ఝాన్సీరాణి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల స్కూల్ గేమ్స్ కార్యదర్శుల నియామక ఉత్తర్వులను విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.సుబ్రమణ్యం తెలిపారు. మదనపల్లె మండలం సిటిఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు వై.నాగరాజు, కలకడ మండలం, కోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు ఝాన్సీరాణి స్కూల్ గేమ్స్ కార్యదర్శులుగా ఎంపికయ్యారు. వీరు పాఠశాల క్రీడా సమాఖ్యకు సంబంధించిన అండర్ -14, అండర్ -17 విభాగాల బాలబాలికల క్రీడల నిర్వహణలో, జట్ల ఎంపిక, స్కూల్ గేమ్స్‌లో పాల్గొనే విధంగా తమ విధులు నిర్వర్తిస్తారు. మొదటి సారిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బాలికల భద్రత సంరక్షణ దృష్ట్యా, బాలికలు క్రీడల్లో పాల్గొనేందుకు తీసుకునే చర్యల్లో భాగంగా మహిళా సెక్రటరీని నియమించడం జరిగిందని రాష్ట్ర స్కూల్ గేమ్స్ కార్యదర్శి భానుమూర్తి రాజు, కమిషనర్ విజయరామరాజు తెలియజేశారు.

బెస్త కార్పొరేషన్ చైర్మన్ శ్రీధర్‌కు సన్మానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎపి రాష్ట్ర బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్ బుధవారం మదనపల్లెలోని బెస్త సాధికార కమిటీ జిల్లా అధ్యక్షులు ముంబై దుర్గా నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా నారా లోకేష్ యువగళం పాదయాత్రలో బెస్త కులస్తులకు ఇచ్చిన హామీల్లో భాగంగా ప్రతి సొసైటీకి పనిముట్లు అందించి బెస్త కులస్తులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో బెస్తల సమగ్ర అభివృద్ధికి సహాయ సహకారాలు అందించడంతోపాటు అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంకు రుణాలు అందేలా చూడాలని ముంబై దుర్గా కోరారు. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం, కార్పొరేషన్ ద్వారా ఆదుకోవాలని కోరారు. అనంతరం కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బొమ్మన శ్రీధర్ బాబుకు పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పొన్న దుర్గ, మురళి, లాయర్ రమణమూర్తి, మల్లికార్జున, మల్లెల రమేష్, ప్రసాద్, మురళి, చలపతి పాల్గొన్నారు.


శ్రీధర్‌ను సన్మానిస్తున్న నాయకులు

మెగా జాబ్‌మేళాలో 108 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలోని శ్రీ శివ నర్సింగ్ కళాశాలలో బుధవారం ఎపి స్కిల్ డెవలప్మెంట్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళా విజయవంతమైందని చైర్మన్ భాస్కర్ మాట్లాడుతూ కంపెనీ ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులందరూ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. జాబ్ మేళాకు దాదాపు 300 పైగా అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు అయన తెలిపారు. 108 అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారున్నారు. ఈ జాబ్ మేళాలో 15 కంపెనీలకు పైగా పాల్గొన్నాయన్నారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎపి స్కిల్ డెవలప్మెంట్ జిల్లా అధికారి నాగార్జున, జెఇఒ హెచ్.దొణప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

14న ఆన్‌లైన్ క్రీడా జ్ఞాన పరీక్ష

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

క్రీడా భారతి 4వ ఆన్‌లైన్ క్రీడా జ్ఞాన పరీక్షను ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభారతి అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్, నరేష్ బాబు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. 12వ తేదీ లోగా క్రీడాభారతి ఆర్గనైజేషన్ మెయిల్ ద్వారా రూ.20 కట్టి వ్యక్తిగత, గ్రూప్, కుటుంబ, ఫ్రెండ్స్ కూటమిగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. 14న జరిగే ఆన్‌లైన్ పరీక్షలో 25 నిమిషాలలో 50 క్రీడా క్విజ్ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వవలసి ఉంటుందన్నారు. ఎక్కువ మార్కులు సాధించి మొదటి స్థానం వచ్చిన వారికి రూ.లక్ష, ద్వితీయ స్థానం రూ.50 వేలు, తృతీయ స్థానం వారికి రూ.25 వేలు, నాల్గవ స్థానం వచ్చిన వారికి రూ.11 వేలు చొప్పున అన్ని రీజియన్‌లకు ఇవ్వడం జరుగుతుందని కేంద్ర క్రీడాభారతి ప్రకటించిందని తెలిపారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై మొగ్గు చూపాలి : జెడిఎ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని అయ్యవారిపల్లిలో ప్రకృతి వ్యవసాయంలో రైతులు సాగు చేసిన 365 రోజుల కూరగాయల మోడల్, 32 రకాల విత్తనాలతో వేసిన పిఎండిఎస్, వరి మోడల్ తదితర వాటిని ఆయన పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు వచ్చిన ఆధాయ, వ్యయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుళికల యూరియా స్థానంలో నానో యూరియాతో తక్కువ ఖర్చుతో ఎక్కువ పిచికారీ చేయవచ్చునన్నారు. నానో యూరియాతో ఫలితాలు కూడా మెరుగ్గా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎడిఎ నాగప్రసాద్, ఎఒ మురళి మోహన్, ఎపిఎంఐ జిల్లా పిడి లక్ష్మీప్రసన్న, కెవికె శాస్త్రవేత్తలు పీరు సాహెబ్, సోమశేఖర్, సిబ్బంది అమరనాథ, పవన్, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా సరఫరా

మండలంలోని రైతులకు యూరియా కొరత లేకుండా సరఫరా చేస్తున్నామని మండల వ్యవసాయ శాఖ అధికారి మురళి మోహన్ అన్నారు. మండలంలోని విఠలం, కూరపర్తి గ్రామాల్లో రైతులకు యూరియాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో 180 టన్నుల యూరియాను పంపిణీ చేయడం జరిగిందని, కూరపర్తి, విఠలం గ్రామాలకు 20టన్నుల యూరియా వచ్చినట్లు తెలిపారు. పంటలు సాగు చేసిన ప్రతి రైతుకు యూరియా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుం టుందన్నారు. రాబోయే రోజుల్లో కూడా యూరియా కొరత లేకుండా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎపిఎంఐపి పీడీ లక్ష్మీప్రసన్న, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విదేశీ విద్యావకాశాలపై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లె

విదేశీ విద్యావకాశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్‌కు చెందిన ఎస్ విసాస్ డైరెక్టర్ విశ్వా కె.రెడ్డి హాజరై విద్యార్థులకు విదేశీ విశ్వవి ద్యాలయాల్లో ప్రవేశ విధానం, స్కాలర్‌షిప్‌లు, వీసా ప్రక్రియలు, ఖర్చుల వివరాలు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్నత విద్యా అవకాశాలు, కెరీర్ అవకాశాలపై విలువైన సూచనలు అందించారు. సరైన ప్రణాళిక, క్రమశిక్షణతో అంతర్జాతీయ స్థాయి విద్యను సాధించడం సాధ్యమని తెలిపారు. డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు గ్లోబల్ కెరీర్ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ప్రతిభ, కృషిని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాయుడు, డీన్ అకాడమిక్స్ డాక్టర్ వి.వి.ఎన్.భాస్కర్, కెరీర్ గైడెన్స్ సెల్ కో-ఆర్డినేటర్ కె.ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

వడ్డెర్లను ఎస్‌టి జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్: రాష్ట్రంలో వడ్డెర కులస్తులను వెంటనే ఎస్‌టి జాబితాలో చేర్చాలని వడ్డెర ప్రజాగళం రాష్ట్ర అధ్యక్షులు ఇడగొట్టు నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రాయచోటిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సమరంలో వడ్డెర్లు అత్యంత చురుగ్గా బ్రిటిష్ వారి ట్రెజరీల మీద, సైన్యం పైన మీద దాడులు చేశారన్నారు. దీంతో బ్రిటిష్ ప్రభుత్వం ఆగ్రహించి సిటీ యాక్ట్‌ను అమలులోకి తెచ్చి వడ్డేరలను అడవులలోకి తరిమి వేశార న్నారు. 1957లో కేంద్ర ప్రభుత్వం సిటి యాక్టును తొలగించిందన్నారు. అప్పటి వరకు వడ్డెర కులస్తులు అడవులలో నివసిస్తూ ఎస్‌సి, ఎస్‌టిలుగా పరిగణింపడేవారన్నారు. 1976 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా వడ్డెరలు ఎస్‌టిలు కొనసాగే వార న్నారు. సామాజికంగా, విద్యా, ఉద్యోగాల పరంగా ఎంతో వెనుకబడిన వడ్డెర కులాన్ని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం బిసి జాబితాలోకి చేర్చడం దారుణం అన్నారు. కాగా పక్కనే ఉన్న తమిళ నాడు, కర్ణాటక రాష్ట్రాలలో నేటికీ వడ్డెరలు ఎస్‌సి జాబితాలో కొనసాగుతున్నారన్నారు. తెలుగు రాష్ట్రాలలో కూడా తమను ఎస్‌టి జాబి తాలోకి చేర్చాలని వడ్డెరలు పెద్దఎత్తున పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వడ్డెరలను ఎస్‌టి జాబితాలోకి చేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వడ్డెర ప్రజాగళం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్య మించక తప్పదంటూ హెచ్చరించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి రాయచోటి అర్బన్: లయన్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం రాయచోటి పట్టణంలో రక్తదాన శిబిరం చేశారు. క్లబ్ అధ్యక్షులు పసుపులేటి మేఘశ్యామ్ జన్మదినోత్స వాన్ని పురస్కరించుకొని దీపా బ్లడ్ బ్యాంక్ లో రక్త దాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో శ్యామ్‌తో పాటు మరో ఐదుగురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం క్లబ్ సభ్యులు అక్కడే కేక్ కట్ చేసి లయన్ శ్యామ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజ నల్ చైర్మన్ షేక్ మహమ్మద్, మాజీ అధ్య క్షులు పెడబల్లి శివారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు


సమావేశంలో మాట్లాడుతున్న గురవయ్య

విద్యుత్ అంతరాయాల నివారణకు చర్యలు

- ట్రాన్స్‌కో టెక్నికల్ విభాగం డైరెక్టర్ కె.గురవయ్య

ప్రజాశక్తి-పీలేరు

రాయలసీమ పరిధిలోని వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం తలెత్తకుండా తగిన చర్యలు చేపడుతున్నట్లు ట్రాన్స్‌కో టెక్నికల్ విభాగం డైరెక్టర్ కె.గురవయ్య తెలిపారు. బుధవారం పీలేరు ఎపిఎస్‌పిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో డివిజన్ స్థాయి విద్యుత్ అధికారులతో ఇక్కడి పరిస్థితులపై ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పరిధిలోని తొమ్మిది జిల్లాల్లోనూలో వోల్టేజి సమస్యలను అధిగమించడం కోసం కొత్తగా 50 విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. ఇవే కాకుండా ప్రజల అవసరాలను గుర్తించి అదనంగా మరో 28 విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణాల అవసరాన్ని గుర్తించి వాటి మంజూరు కోసం కూడా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఒక్కొక్క విద్యుత్ సబ్ స్టేషను నిర్మాణానికి ప్రభుత్వం సుమారు రూ.4 కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని అన్నారు. రైతుల నుంచి వ్యవసాయ విద్యుత్ సర్వీసుల కోసం అందిన విన్నపాలపై క్షేత్ర స్థాయి పరిశీలనల అనంతరం త్వరితగతిన రైతులకు వ్యవసాయ విద్యుత్ సర్వీసులు ఇస్తున్నట్లు చెప్పారు. గృహ, మోటర్లు, స్టాటర్లు, యంత్రాలు, ఇతర విద్యుత్ వినియోగ ప్రదేశాల్లో విధిగా యర్తింగ్ పద్ధతిని అనుసరిస్తే విద్యుత్ ప్రమాదాల నివారణకు చెక్ పెట్టవచ్చని తెలియజేశారు. స్టార్ రేటింగ్ ఉండే నాణ్యమైన విద్యుత్ వైర్లు, వస్తువులు, పరికరాలు వినియోగించాలని పేర్కొన్నారు. ఈ విషయంలో వినియోగదారులు కాస్త దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. విద్యుత్ చౌర్యానికి ఎవరూ పాల్పడ వద్దని చెప్పారు. సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి విద్యుత్ శాఖ అభివృద్ధికి వినియోగదారులు తమ వంతు సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాయచోటి ట్రాన్స్‌కో ఎస్ఇ ఎం.చంద్రశేఖర్ రెడ్డి, పీలేరు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఅండ్‌పి సిఎం విజయభాస్కర్, పీలేరు డివిజన్ పరిధిలోని ఎడిఇలు జి.అమీర్ బాష, ఎం.శివయ్య, జ్ఞానేశ్వర్, లక్ష్మీపతి, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ బ్రహ్మయ్య ఆచారి, పీలేరు డివిజన్ పరిధిలోని అసిస్టెంట్ ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


భూమి పత్రాలను పరిశీలిస్తున్న తహశీల్దార్ పుల్లారెడ్డి

ఆక్రమణకు అడ్డుకట్ట

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని తిప్పాయపల్లె పంచాయతీలోని సర్వేనెంబర్ 496/1462లో ప్రభుత్వం తమకు భూమికి కేటాయించిందని రిటైర్డ్ ఆర్మీ పాడుగుండ్ల రమేష్, రమాదేవి తెలిపారు. కబ్జాదారులు ఆ పొలాన్ని రాత్రికి రాత్రే చదును సేశారన్నారు. తహ శీల్దార్ పుల్లారెడ్డికి ఫిర్యాదు చేయడంతో ఆ పొలాన్ని పరిశీలించి ఈ పొలాన్ని బాధి తులకే అప్పగిస్తామని తెలిపారు. ప్రభుత్వ అను మతి లేకుండా ఎటువంటి భూములు కబ్జా చేసిన ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అనియత విద్యా బోధకులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-సుండుపల్లి

అనియత విద్య బోధకులు, సూపర్వైజర్లను 2001లో అప్పటి సిఎంగా ఉన్న చంద్రబాబు తొలగించడంతో వారంతా రోడ్డున పడ్డారని, వారిని ఆదుకో వాలని ఉమ్మడి కడప జిల్లా జిల్లా అధ్యక్షులు బి.వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనియత విద్య ద్వారా బోధకులు, సూర్వైజర్లు వేలాది మంది జీవనం సాగించేవారని పేర్కొన్నారు. 2001లో వారిని తొలగించి ఒక్క శాతం మందిని తిరిగి స్కూల్ కాంప్లెక్స్‌లో సిఆర్‌పిలుగా తీసుకొని మిగిలిన వారిని రోడ్లమీద వదిలేయడం దుర్మార్గమన్నారు. రోడ్డుపడ్డ వారి కుటుంబాల కోసం అనేకసార్లు ముఖ్యమంత్రి కార్యాలయానికి కాళ్లరిగేలా తిరిగినా ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ఇప్పటికీ రాష్ట్ర అనిత విద్య సంఘాల ఉద్యోగాల నుంచి తొలగించిన వారికి తిరిగి ఉద్యోగాన్ని నియమించాలని సిఎంను పదేపదే కోరినా ఆయనలో ఎటువంటి స్పందన లేదన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి ఉద్యోగాల్లో నుంచి తొలగించిన వారిని ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు.

ఫొటోగ్రాఫర్స్ పట్టణాధ్యక్షుడిగా మధు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



మదనపల్లె ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ పట్టణా ధ్యక్షుడిగా మధు స్టూడియో అధినేత మధు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం స్థానిక సిఎస్ఐ జిఎస్ఎం ఫంక్షన్ హాల్లో పట్టణ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మదనపల్లె పట్టణాధ్యక్షుడిగా మధును సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో రెండు పర్యాయాలు పట్టణాధ్యక్షుడిగా పని చేసిన అనుభవం ఆతడికి ఉంది. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ పట్టణంలోని ఫొటో, వీడియో గ్రాఫర్స్ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా ప్రయత్నిస్తామని, ఆపద సమయంలో యూనియన్ తరఫున ఆదుకుంటామని హామీనిచ్చారు. ఈ సందర్భం గా పలువురు మధుకు ప్రశంసలు, అభినందనలు తెలిపారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

యుటిఎఫ్ మండల అధ్యక్షులుగా రఫీ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రంలో బుధవారం యుటిఎఫ్ మండల శాఖ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రమణమూర్తి హాజరై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సీనియర్ నాయకులు సాంబశివరావు పరిశీలకులుగా వ్యవ హరించారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులుగా రఫీ, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ, కోశాధికారిగా మాధవమూర్తి, గౌరవ అధ్యక్షు లుగా వరదారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి రమణమూర్తి తెలిపారు. నూతన కమిటీ పట్ల సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అధ్యక్షులు రఫీ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని, పిఆర్‌సి కమిటీని ఏర్పాటు చేసి 40శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : ప్రభుత్వ ఆస్పత్రులలో పరిశుభ్రత పాటించాలని కలికిరి సిహెచ్‌సి వైద్యాధికారి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం తంబళ్లపల్లె సిహెచ్‌సి ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలు వెటర్నరీ వార్డు, ఓపి విభా గాలు, ల్యాబ్‌ను పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తంబళ్లపల్లె, బి.కొత్తకోట, కలికిరి మూడు ప్రభుత్వ ఆస్పత్రులో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగాపరిశీలన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట డాక్టర్ విక్రాంత్‌రెడ్డి, హెడ్‌సిస్టర్ గ్లోరీలిటిల్‌ఫ్లవర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-రామాపురం : మండలంలోని పంచాయతీ ఏకిలపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త కదిరి నరసింహులు భార్య అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి బుధవారం ఏకలపల్లివెళ్లి కదిరి నరసింహులు భార్య మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఆయన వెంట సరస్వతిపల్లె సింగిల్ విండో అధ్యక్షుడు గాలివీటి సురేంద్రరెడ్డి, చిన్న కృష్ణారెడ్డి, దేవదర్శన్‌రెడ్డి, కోలి మివాండ్లపల్లి సింగిల్ విండో డైరెక్టర్ సహదేవరెడ్డి, చదిపిరాళ్ల పెద్దబసిరెడ్డి, భవ నం వెంకట్రామిరెడ్డి, రామకృష్ణగౌడ్ పాల్గొన్నారు.

అంగన్వాడీ పిల్లలకు బ్యాగుల పంపిణీ

ప్రజాశక్తి-కలికిరి : మండలంలోని గుట్టపాలెం అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలకు రాష్ట్రీయ గ్రామీణ సాక్షారత్ మిషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ అరుంధతి మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల్లో అన్ని రకాల సేవలు అందిస్తుందని పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్.రామచంద్రయ్య, పద్మనాభయ్య, పద్మనాభయ్య, సి.రెడ్డప్ప, సర్పంచ్ వెంకటరెడ్డి, ఎస్ నాగభూషణ, అమర్నాథ్ మరియు చేనేత కార్మికులు, స్కూల్ హెచ్ఎం మల్లారెడ్డి, అంగన్వాడీ టీచర్లు ఎస్ నూర్జహాన్, హెల్పర్ ఎస్ సరిత, పంచాయతీ సెక్రెటరీ తిమ్మారెడ్డి పాల్గొన్నారు.


బ్యాగులు చూపుతున్న అంగన్వాడీ చిన్నారులు

మోతాదుకు మించి యూరియా వాడొద్దు


వీరబల్లి: పొలంలో నానో యూరియా పిచికారి చేపిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండలంలోని బావికాడపల్లిగ్రామపంచాయతీలో జరిగిన 'రైతన్న అధిక యూరియా వాడొద్దన్నా' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సతీష్‌కుమార్ మాట్లాడుతూ అధిక యూరియా వాడడం వల్ల భూసారం క్రమంగాతగ్గిపోతుందని పంటలకు చీడ పీడల వృద్ధి పెరుగుతుందని,సేద్యపు ఖర్చులు పెరిగి లాభం తగ్గుతుందని తెలిపారు. తహశీల్దార్ పుల్లారెడ్డి మాట్లాడుతూ అధిక యూరియా వాడడం వల్ల మొక్క వేపుగా పెరిగి దిగుబడిని తగ్గిస్తూ దానితోపాటు నాణ్యత కూడా తగ్గుతుందని రైతులు దీనిని గ్రహించి పశువుల పేడను, చెట్ల ఆకుల నుంచి పచ్చిరొట్ట ఎరువుగా తయారు చేసుకుని, జీవామృతాన్ని కూడా ఉపయోగించాలని అన్నారు. అంతేగాకుండా యూరియాకి బదులు నానో యూరియా లిక్విడ్ రూపంలో పంట లకు స్ప్రే చేసినచో మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం అమలులోకి రావాలంటే మహిళలు, మహిళా సంఘాలు, రైతులు కూడా గ్రూప లుగా ఏర్పడి ముందుకు రావాలని కోరారు. అగ్రికల్చరల్ ఎడి మణి మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు, జీవామృతాన్ని బాగా ఉపయోగించాలని కోరారు. కార్యక్రమంలో ఎఒ ప్రవీణ్ కుమార్, మస్తాన్ మండల టిడిపి అధ్యక్షులు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు, ఆర్.సుధాకర్‌నాయుడు, కర్ణం రాజానాయుడు, పచ్చాహరి, సంజీవ్ గాంధీ చవనఅంజి, ఒలేటి వెంకటాద్రి, కాపర్ల యానాదయ్య రైతులు, మహిళలు పాల్గొన్నారు.**గాలివీడు :** వరి పొలం సాగు చేసుకుంటున్న రైతులు యూరియాను తక్కువగా వాడాలని ఎప్పటినుంచో ఇప్పటివరకు వాడ డం ద్వారా భూమిలో సారం పోతుందని తహశీల్దార్ భాగ్యలత పేర్కొన్నారు. నూలివీడు ఆవులరెడ్డిగారిపల్లిలో గ్రామసభ నిర్వహించారు. సేంద్రియ ఎరువులను, జీవామృతం ద్రావకం వాడడం ద్వారా పంటల దిగుబడి అధిక శాతం వస్తాదని పంటలు వ్యాధులు కూడా రాకుండా పోతాయని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఒ గౌతమి, విఆర్ఒ వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు శివారెడ్డి, రైతులు పాల్గొన్నారు. **కలకడ:** మండలం లోని గంగాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిం చినట్లు మండల వ్యవసాయ అధికారి ఎంఎస్.శ్రీనివాస్ తెలి పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ యూరియా లభ్యత, సేంద్రీయ ఎరువుల వాడ కంపై అవగాహన, నానో యూరియా వినియోగంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మద్దిపట్ల వెంకటరమణ నాయుడు, ఎంపిడిఒ భాను ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు. **వీరబల్లి:** నానో యూరియా, డిఎపి వినియోగంపై గురప్పగారిపల్లి పంచాయతీలో రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వ్యవసాయశాఖ అధికారి స్వాతి పాల్గొని మాట్లాడుతూ మండలంలో యూరియా అందుబాటులో ఉందన్నారు. కావలసిన రైతులు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి తీసుకోవచ్చని తెలిపారు. తహసిల్దార్ ఖాజాబీ మాట్లాడుతూ ప్రతి రైతు యూరియా బదులుగా నానో యూరియా వాడవల్సిందిగా సూచించారు.

యూరియా కోసం ఆందోళన వద్దు

కలకడ: మండలంలోని రైతులు యూరియా కోసం ఆందోళన చెందవలసిన అవసరం లేదని తహశీల్దార్ మహేశ్వరిబాయి సూచించారు. మండలము లోని రైతులకు యూరియా అందుబాటులో ఉన్నదని ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. కదిరాయచెరువు గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో నానో జీవన ఎరువులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ యూరియా అధిక వినియోగం వలన భూసారం తగ్గుతుందని అవసరానికి మించి యూరియా వాడకూడదని తెలిపారు. ప్రయివేట్ దుకాణాలలో అధిక ధరలకు విక్రయిస్తే కేసు లు నమోదు చేస్తామని తెలిపారు. యూరియాను నిల్వా ఉంచినా, ఎక్కువ ధరకు విక్రయించిన 08561293006 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలని రైతులకు సూచించారు. యూరియా అధికముగా వాడకం వలన రైతులకు నష్టం జరుగుతుందని, ప్రకృతి ఎరువులువాడాలన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం


తలపల రేవతి, శ్రీనివాసులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండల పరిధిలోని ఆర్.రాచపల్లి జడ్‌పి హైస్కూల్‌లో విధులు నిర్వ హిస్తున్న తలపల రేవతి జీవశాస్త్ర ఉపాధ్యాయినీ దినోత్సవం సంద ర్భంగా ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సివి.సత్యనారాయణ, ఉపాధ్యా యులు బృందం ఆధ్వర్యంలో రేవతి దంపతును దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థుల విద్యాభివృద్ధికి ఆమె చేసిన కృషికి మంచి గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. తమ పాఠశాల నుంచి ఉత్తమ ఉపాధ్యా యులుగా ఎంపిక కావడంతో పాఠశాలకు గర్వకారణమన్నారు. భవిష్యత్తులో కూడా మరెన్నో అవార్డులు పొందుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యా ర్థులు, ఉపాధ్యాయులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తాడేవాండ్లపల్లి స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఒ.సుధాకర్, ఉపాధ్యాయులు జి.గురుప్రసాద్, పి.హరినాథ్‌బాబు, డి.సురేఖ, వెంకటయ్య, వి.సుధామాధవి, యస్.బి.మాబుషాయాబ్, సి.శివశంకర్, స్కూల్ చైర్మన్ టి.నరసింహులు పాల్గొని ఆమెకు అభినందనలు తెలిపారు.

సన్మానం అందుకున్న రఘురామయ్య

వీరబల్లి: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకుడు రఘురామయ్య రాష్ట్ర ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యాడు. ఈనెల 5న విజయ వాడలో ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది ఏర్పాటు చేసిన సన్మాన సభలో వైసిపి రాష్ట్ర పంచాయతీ విభాగం ప్రధాన కార్యదర్శి గాలివీటి వీరనాగిరెడ్డి, విఆర్‌డిఎస్ సురేంద్రారెడ్డి, లిబిన్ డియోగ్నసిస్ట్ ఎండి, వికాసాండ రెడ్డి శాలువ, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి కృషి వంచన లేకుండా కృషి చేసారని తెలిపారు. ఆర్ఐఐ రవికుమార్ మాట్లాడుతూ రఘురామయ్య కళాశాల అభివృద్ధికి ఆయన చేసిన సేవలు గుర్తించి ఈ అవార్డు అందుకున్నారని భవిష్యత్తులో జాతీయ అవార్డు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అజంతబ్బా, రఘురామయ్య ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ భాస్కర్,సిబ్బంది పాల్గొన్నారు.


రఘురామయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

ఆత్మహత్యల నివారణపై అవగాహన ర్యాలీ



ఆత్మహత్య నివారణకు ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి పట్టణంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు, చైతన్య ర్యాలీని నిర్వహించారు. జిల్లా డియంహెచ్‌పి, నోడల్ ఆఫీసర్, సైకియాట్రిస్ట్ డాక్టర్ పి.ఉదయ్ కిరణ్, టూ టౌన్ సిఐ కె.రాజా రెడ్డి, ప్రిన్సిపల్ రమాదేవి, మోటివేషనల్ స్పీకర్ డిజి. రామమూర్తి, డిఎంహెచ్‌పి క్లినికల్ సైకాలజిస్ట్ రాధికా, సైకియాట్రిక్ సోషల్ వర్కర్ గౌతమి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన కార్యక్రమంలో అధికారులు ఆత్మహత్యల నివారణపై అవగాహన కల్పిస్తూ మానసిక ఆరోగ్య ప్రాముఖ్యత గురించి వివరించారు. 2025 సంవత్సరానికి ఆత్మహత్యపై దృక్కోణం మార్చడం అనే థీమ్‌ను విద్యార్థులకు పరిచయం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో టెలీ హెల్ప్‌లైన్ 14416ద్వారా తక్షణ సైకియాట్రిక్ సహాయం పొందవచ్చని విద్యార్థులకు తెలపారు. ఇందులో భాగంగా స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన వైసిపి నాయకులు


ఎంపీ మిథున్‌రెడ్డితో సాహిత్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని వైసిపి రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు టి. సాహిత్ రెడ్డి కలిసి ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఆయన ఢిల్లీలో ఎంపీని మర్యాదపూర్వకంగా కలిశారు. మద్యం కేసులో అక్రమ అరెస్టుకు గురైన ఎంపికి మధ్యంతర బెయిలు లభించడంతో ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పాల్గొనడానికి ఢిల్లీ వెళ్లారు. సమాచారం అందుకున్న పీలేరు నియోజకవర్గం కెవి పల్లి మండలం, నూతనకాలువకు చెందిన వైసిపి రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు ఎంపీని ఢిల్లీలోని తన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు

వాల్మీకిపురం: కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షపూరితంగా మోపిన అక్రమ కేసుల్లో అరెస్ట్ అయిన రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డికి కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరైన సందర్భంగా, హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో పలువురు నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మాజీ ఎపిఎండిసి డైరెక్టర్ హరీష్‌రెడ్డి మిథున్ రెడ్డిని కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ వెంకట మిథున్‌రెడ్డి మాట్లాడుతూ తాను ప్రజల పక్షాన బలంగా నిలుస్తున్నందుకే కూటమి ప్రభుత్వం కుట్రపూర్వకంగా కేసులు మోపిందన్నారు. హరీష రెడ్డి మాట్లాడుతూ మిథున్‌రెడ్డి తన పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని గుర్తు చేశారు.ఇలాంటి అడ్డంకులు రాజకీయాల్లో సహజం అని, కానీ నిజాయితీగా పనిచేసే నాయకుడిని ప్రజలు ఎప్పటికీ వదులుకోరన్నారు. త్వరలో ఆయన నిర్దోషిత్వం నిరూపితమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.


ఎంపీ మిథున్‌రెడ్డితో మాట్లాడుతున్న హరీష్‌రెడ్డి

చెత్త సేకరణ పనులు తనిఖీ

ప్రజాశక్తి-నందలూరు


పారిశుధ్య కార్మికులకు సూచనలుఇస్తున్నడిఎల్‌పిఒ

మండలంలోని నందలూరు గ్రామ పంచాయతీలో గల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించే ఇంటింటి వద్ద చెత్త సేకరణ పనులను రాజంపేట డివిజనల్ పంచాయతీ అధికారి మస్తాన్‌వల్లి, డిప్యూటీ ఎంపిడిఒ ఎస్.సునీల్‌కుమార్ బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎల్‌పిఒ శానిటేషన్ సిబ్బంది, క్లాప్ మిత్రు లకు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూపర్ సిక్స్ సూపర్ హిట్ హోర్డింగ్‌ను డివిజనల్ పంచా యతీ అధికారి మస్తాన్‌వల్లి ప్రారంభించారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లి, నందలూరు పంచాయతీ కార్యదర్శులు సురేష్ కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎగువ చెన్నామర్రి పరిసరాల్లో పులి సంచారం

- భయాందోళన చెందుతున్న రైతులు, గ్రామస్తులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కురబలకోట మండలం,ఎగువ చెన్నామర్రి వద్ద హార్సిహిల్స్ అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు ప్రజలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక రైతులు మాట్లాడుతూ మంగళవారం రాత్రి పొలం దగ్గర కట్టేసి ఉంచిన కుక్కను పులి చంపిందన్నారు. ఆర్.రెడ్డి శేఖర్ రెడ్డి పొలం దగ్గర వారి పెంపుడుకుక్కను ప్రతి రోజు రాత్రి సమయంలో కాపలాగా చెట్టుకు కట్టేసేవాడు.ఈ క్రమంలో మంగళవారం రాత్రి చెట్టుకి కట్టేసి ఉన్నపెంపుడు కుక్కని చంపేసి అడవికి తీసుకెళ్లిందన్నారు. బుధవారం తెల్లవారి పొలం వద్దకు వచ్చి చూడగా కుక్క లేకపోవడంతో రక్త మరకలు ఉండడంతో భయందోళనకు గురయ్యారు.ఈ విషయం స్థానికులు లకు తెలుపగ స్థానికులు అందరు అక్కడికి వచ్చి అటవీశాఖ వారికి సమాచారం అందజేశారు.అటవీ శాఖ వారు వచ్చి అడుగు జడలు చూసి పులి అని నిర్ధారించారు. గ్రామ స్తులు, రైతులు, స్థానికులకు జాగ్రత్తగా ఉండాలని అటవీశాఖ అధికారి జయరాం సూచించారు.


పాడి రైతుకు బహుమతి అందజేస్తున్న అధికారి

పాడి రైతులు మెలకువలు పాటించాలి

ప్రజాశక్తి-పీలేరు

పశు పోషణలో పాడి రైతులు తగిన మెలకువలు పాటించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్ పిళ్లై తెలిపారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకంలో భాగంగా పశుసంవర్ధక శాఖ సౌజన్యంతో తిరుపతి జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ బుధవారం పీలేరు మండలం, రామిరెడ్డిగారిపల్లిలో లేగ దూడల ప్రదర్శన నిర్వహించింది. 45 వేల జాతి లేగ దూడలతో నిర్వహించిన ఈ ప్రదర్శనలో సౌష్ఠవంగా, ఆరోగ్యంగా ఉండే మూడు లేగ దూడలను ఎంపికచేసి వాటికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రదానంచేశారు. కార్యక్రమంలో రాయచోటి అనిమల్ హస్బెండరీ డిడి డాక్టర్ డి.మాలకొండయ్య, పశువైద్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రజాశక్తి-మదనపల్లె

మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఏపిసెట్ ప్రాక్టీస్ పరీక్ష-2025లో ప్రతిభ కనబరిచిన 10 మంది విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సి.యువరాజ్ విజేతలైన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున నగదు బహుమతి ప్రదానం చేశారు. షేక్ సాబీర్, సి.రాంచరణ్, డి.సయ్యద్ సోహైల్, టి.హరీష్, వి.మధు చరణ్, షేక్ యాదుల్లా, బి.వెంకటేశ్వర్లు, వి.టాగోర్, సయ్యద్ మహమ్మద్, ఎం.శ్రీలిఖిత ఈ బహుమతి అందుకున్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డి.ప్రదీప్ కుమార్, సీనియర్ మేనేజర్ మారుతీ ప్రసాద్, రియాజ్ అలీ, జి.శ్రీనివాస్, ముస్తఫా పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆటో బోల్తా : 8 మంది కూలీలకు గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆటో బోల్తా పడిన ఘటనలో 8 మంది కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విష మం గా మారింది. ఈ సంఘ టన బుధవారం కురబలకోట మండ లంలో జరిగింది. ముదివేడు పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె పట్టణంలోని రామారావు కాలనీకి చెందిన కూలీలు శ్రీనివాసులు, రవణమ్మ, రామసుధ, సరస్వతి, రమణమ్మ, లక్ష్మీదేవి, ఎం. శ్రీనివాసులు కురబలకోట మండలం, ముదివేడులో టమాటాలు కోసేందుకు కూలీకి ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యంలో ముదివేడు సమీపంలోని కృష్ణారెడ్డిపల్లి వద్ద ఎదురుగా ద్విచక్రవాహనం వేగంగా రావడంతో దానిని తప్పించే క్రమంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న కూలీలందరూ కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధిత కూలీలను 108లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో రమణమ్మ తలకు బలమైన గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా మారింది. శ్రీనివాసులు అనే అతనికి కాలు విరిగింది. మిగతా కూలీలందరూ గాయాలతో బయటపడ్డారు. పరీక్షించిన వైద్యులు బాధితులను ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

10 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని ముష్టూరు పంచాయతీ ముష్టూరు గ్రామానికి సమీపంలో మొరం చిన్నఅప్పోడుఅనే వ్యక్తి నాటు సారాను తీసుకువచ్చి అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందిందన్నారు. బుధవారం నాటు సారా విక్రయ స్థావరంపై దాడి చేసి అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సులువుగా డబ్బును సంపాదించడానికి నాటుసారాను తయారుచేసి విక్రయిస్తున్నట్లు నిందితుడు అంగీకరించడంతో అతనిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు ఎతెలిపారు. మండలంలో నాటుసార తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారి పై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి పట్టణంలో జరిగింది. బాధితుని కుటుంబ సభ్యుల కథనం మేరకు..స్థానిక పాయిరామన్నవీధిలో నివాస ముంటున్న సోవ ఎశేఖర్ డిగ్రీ వరకు చదివి ఇంటి పట్టునే ఉంటున్నాడు. ఏమి కష్టం వచ్చిందో ఏమో.. తాను ఉంటున్న ఇంటిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య యత్నానికి పాల్ప డ్డాడు. గమనించిన తల్లిదండ్రులు కేకలు వేయడంతో స్థానికులు వచ్చి సోమశేఖర్‌ను ఉరి నుంచి తప్పించారు. బాధితున్ని ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పోలీసులు విచారిస్తున్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కారు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందగా అతని మనవరాలు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం సాయంత్రం మదనపల్లెలో జరిగింది. రెండో పట్టణ పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని బి.కె పల్లె కాలనీలో చిల్లర దుకాణం నిర్వహిస్తున్న బుడన్‌సాబ్ కుమారుడు మస్తాన్(59), మనవరాలు సమీహ కౌసర్‌తో కలసి స్థానికంగా ఉన్న చౌక దుకాణానికి ద్విచక్ర వాహనంలో బయల్దేరాడు. బైపాస్ రోడ్డులోని చంద్రకాలనీ వద్ద, అనంతపురం నుంచి తిరుపతి వైపు వెళుతున్న ఓ కారు వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో మస్తాన్ తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి వెళ్లగా, మనవరాలు గాయపడింది. గమనించిన స్థానికులు బాధితులను స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన అత్యవసర విభాగ వైద్యులు మస్తాన్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తర లించారు. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు సంఘటన స్థలం వద్దకు వెళ్లి పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కారు డ్రైవర్ పారిపోయినట్లు స్థానికులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫి ర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సిఐ రాజారెడ్డి తెలిపారు. మృతునికి భార్య హబీబున్నీసా, ఇద్దరు కుమార్తెలు ఓ కుమారుడు ఉన్నారు.

భూ తగాదాలతో రెండు గ్రూపులు మధ్య ఘర్షణ

ప్రజాశక్తి- కలకడ

భూ తగాదాలతో ఇరు గ్రూపులు ఘర్షణ జరిగిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ముడియం వారిపల్లి, కొత్తపల్లి గ్రామానికి చెందిన గట్టు వెంకటరమణకు, అదే గ్రామానికి చెందిన వల్లూరి ప్రసాద్ కుటుంబ సభ్యులకు గతంలో భూతగాదాలు ఉండేవన్నారు. బుధవారం సాయంత్రం వల్లూరు ప్రసాద్ అతని కుటుంబ సభ్యులు గట్టు వెంకటరమణ , అతని భార్యను పొలం వద్ద ఉండగా, టమోటా చెట్లకు నాటే కట్లతో దాడి చేశారన్నారు. వెంకట రమణ కుమారుడైన ప్రవీణ్ వెళ్లి వారిని తీసుకొని ఇంటికి రాగ, తిరిగి ప్రసాద్ వారి కుటుం బ సభ్యులతో ప్రవీణ్ వాళ్ళ ఇంటి వద్దకు వెళ్లి అతనిపై, అతని కుటుంబ సభ్యులపై కొడవ లితో దాడి చేశారన్నారు. ప్రవీణ్‌కు కుడి చేయి, శరీరంపై అక్కడక్కడ రక్త గాయాలు గాయా లు అయ్యాయని తెలిపారు. ఈఘర్షణలో ప్రసాద్‌కు కూడా తలపైన గాయాలు అయినట్లు తెలిపారు. ప్రసాద్ మహల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రవీణ్, అతని కుటుంబ సభ్యులను వాయల్పాడు ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో తీసు కెళ్లినట్లు డ్రైవర్ శ్రీనివాసులు తెలిపారు. కలకడ సిఐ లక్ష్మన్న ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కలకడ పోలీసులు తెలిపారు.